క్లుప్తంగా

విస్తారంగా వానలు



ఉధృతంగా పారుతున్న బండూరు వంక

బొమ్మనహాళ్: మండలంలో గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగుతున్నాయి. పై ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నా నేపథ్యంలో వేదావతి హగరి నదికి భారీగా వరద నీరు వస్తున్నాయి. బండూరు వద్ద వంక ఎక్కువగా ప్రవహించడంతో 15 గ్రామాల ప్రజల మండల కేంద్రానికి వెళ్లాలంటే బండూరు, దేవగిరి, ఉద్దేహాళ్ రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రానికి వెళ్లాలంటే ఉద్దేహాళ్‌కు వెళ్తే గుంతల రోడ్డులోనే రాకపోకలు కొనసాగించాలి. రెండు రోజులుగా వంక భారీగా పారుడుతుండడంతో ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



రామాంజనేయులు (ఫైల్)

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంటలో సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతకాయల రామాంజనేయులు (54) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. పార్టీ గ్రామ మాజీ కన్వీనర్‌గా, మాజీ వార్డు సభ్యులు, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్‌గా సేవలు అందించారు. సీనియర్ నాయకులు మృతి పట్ల ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. సర్పంచ్ రత్నమ్మ, మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, స్థానిక నాయకులు దేవనాథ్‌రెడ్డి, సోమప్ప, ఆదెప్ప, ప్రతాప్‌రెడ్డి, హనుమంతరాయుడు తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం మండల ఉపాధ్యక్షుడు మల్లాపురం మల్లి తల్లి బాలనాగమ్మ (70) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు, మండల కన్వీనర్ గోళ్లసూరి మల్లాపురం వెళ్లి బాలనాగమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.హనుమంతురాయుడు, మల్లికార్జున, భరత్, నాయకులు పాల్గొన్నారు.

జంబుగుంపలలో చోరీ

కుందుర్పి: మండలంలోని జంబుగుంపలలో శనివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు ఈరన్న తెలిపిన మేరకు.. శనివారం ఉదయం బంధులఇంట్లో శుభకార్యానికి వెళ్లగా, ఎవరూ లేరని గుర్తించి దుండగులు అర్ధరాత్రి తలుపులు ధ్వంసం చేసి, ఇంట్లోకి ప్రవేశించి, బీరువాలోని రూ.35వేల నగదు, రూ.23వేల విలువజేసే బంగారు నగలు ఎత్తుకెళ్లారు.

అంధకారంలో అనంత వెంకటరెడ్డి కాలనీ



అనంతవెంకటరెడ్డి కాలనీలో వెలుగని వీధిలైటు

కూడేరు: మండల కేంద్రంలోని అనంత వెంకటరెడ్డి కాలనీలో వీధిలైట్లు వెలగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలనీలో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆరు వీధులు ఉండగా, కొన్ని వీధుల్లో స్తంభాలకు బల్బులు ఏర్పాటు చేయలేదు. కొన్ని పూర్తిగా వెలగడంలేదు. ఈవిషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల ధరలు నియంత్రించాలి

బెళుగుప్ప: ఎరువుల కొరత తీర్చి, ధరలు నియంత్రించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు ఆదివారం ప్రకటనలో తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని, ధరలు కూడా తగ్గించాలన్నారు. ప్రభుత్వం జిల్లాకు సరఫరా చేస్తున్న ఎరువుల్లో 70 నుంచి 80 శాతం ప్రైవేట్ వ్యాపారులకు కేటాయించడం తగదని వ్యవసాయ సహకార సంఘాల సొసైటీలకు, డీసీఎంఎస్‌లకు కేటాయించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



విశేష పూజలందుకున్న రాఘవేంద్రస్వామి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని కోటలో వెలసిన రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు ఆదివారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆదివారం మొదటిరోజు స్వామి పూర్వారాధన సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అష్టోత్తరం, పంచామృతం, పాదపూజ, ప్రవచనం, ప్రాకారోత్సవం, మధ్యాహ్నం కనకాభిషేకం, హస్తోదకం, సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించా రు. సోమవారం మధ్యారాధన, మంగళవారం స్వా మి ఉత్తర ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాఘవేంద్ర స్వామి మఠం సభ్యులు తెలిపారు.

ఎరువు కరువు..సాగు బరువు

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న డీలర్లు
- అధిక ధరలకు అంటగడుతున్న దుకాణదారులు
- యూరియా దొరక్క అవస్థలు పడుతున్న అన్నదాతలు

రాయదుర్గం: ఖరీఫ్ సీజన్‌లో ఎక్కడ చూసినా పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. సరిపడా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే ఎరువులు దొరక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులు రైతు అవసరానికి మించి ఎరువులు సరఫరా చేస్తున్నట్టు ఆన్‌లైన్‌లో లెక్కలు చూపుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉంది.

జిల్లాలోని 32 మండలాల్లో జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు 26,839 మెట్రిక్ టన్నులు యూరియా అవసరమని గుర్తించారు. ఆదిశగా ఇప్పటికే 27,892 మెట్రిక్ టన్నులు అదనంగా సరఫరా చేసినట్టు లెక్కలు చూపారు. ఈ స్థాయిలో యూరియా రైతుకు చేర్చి ఉంటే కొరత అనే మాట వినిపించదు. డీలర్ల వద్దే నిల్వలు చేసుకొని రైతులకు విక్రయించినట్టు లెక్కలు చూపి, కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్తా యూరియా రూ.275 కు విక్రయించాలి. మార్కెట్లో వ్యాపారులు రూ.350 నుంచి రూ.400 లకు విక్రయిస్తున్నట్టు జిల్లా వ్యాప్తంగా వినిపిస్తోంది. దీనికి తోడు జింక్ లేదా గుళికలు తీసుకోవాలనే లింకు పెట్టి రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.



ఉద్దేహాళ్ సహకార సొసైటీ వద్ద యూరియాకోసం బారులుదీరిన రైతులు

ఆయకట్టు పరిధిలో మరీ దారుణం

తుంగభద్ర హైలెవెల్ కెనాల్ ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల చేశారు. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు నార్లు వేసుకోగా, బోర్ల కింద ముందే నారు సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు మొదలెట్టారు. ఈ నేపథ్యంలో అన్ని రకాల ఎరువులు రైతుకు అవసరం కానుంది. ఇలాంటి పరిస్థితుల్లో యూరియా, డీఏపీ లాంటి ఎరువుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. రెండు రోజుల క్రితం యూరియా కోసం రైతులు బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ సహకార సొసైటీ కార్యాలయం ఎదుట బారులు దీరి ఉండడమే ఇందుకు నిదర్శనం. 20:20:0:13 ఇతర కాంప్లెక్స్ ఎరువుల కొరత కూడా కనిపిస్తోంది. ఈ లోటు తీర్చేలా అధికారులు, పాలకులు కృషి చేయాల్సిన అవసనం ఉంది. కృత్రిమ కొరత కొనసాగిస్తే రైతులు ఎక్కడికక్కడ రోడ్డెక్కి ఆందోళన చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుతానికి అన్ని రకాల ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కొరత లేకుండా సరఫరా చేస్తాం

ఎరువుల కొరత రానీకుండా చర్యలు చేపట్టాం. ముందస్తుగా ఇండెంట్ రావడంతో ఈ నెల నుండి పూర్తి స్థాయిలో విక్రయాలు మొదలయ్యాయి. నిల్వలు ఉంచుకుని కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బందుల్లేకుండా ఎరువులు సరపరా జరిపేలా కృషి చేస్తాం. ఇందులో ఎలాంటి ఆందోళన అవసరం లేదు.

– ఉమామహేశ్వరమ్మ, జేడీఏ, అనంతపురం

రైతు అవసరాలు తీర్చాలి



ఎరువుల కొరత రైతుల్ని వేధిస్తోంది. యూరియా, ఇతర ఎరువులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వానికి ముందుచూపులేదు. సరిపడా ఎరువులు సరఫరా చేయలేదు. ఆన్‌లైన్‌లో లెక్కలు చూపుతున్నారు. యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్సులన్నీ దుకాణాల్లో అందుబాటులో ఉంచాలి. లేకుండా రైతులతో కలసి ఉద్యమిస్తాం.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే


మోసం చేయడం చంద్రబాబు నైజం



చంద్రబాబు మోసాలపై వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బ్రహ్మసముద్రం : ఎన్నికలకు ముందు ఎలాగైనా అధికారంలోకి రావాలని చెప్పి సాధ్యంకాని హామీలివ్వడం.. అధికారంలోకొచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబు నైజం అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బ్రహ్మసముద్రం మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కూడా అన్నివర్గాల ప్రజలకు ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రస్తుతం కూటమి ఏడాది పాలనలో ప్రజల్లో పూర్తిగా వ్యతిరేకత వచ్చిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎర్రకొండాపురం గోపాల్, నాగభూషణ, లింగమయ్య, ముక్కన్న, వెంకటేశులు, నటరాజ్, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 14వ వార్డు ఎన్టీఆర్ కాలనీ నుంచి భంభంస్వామి దర్గాకు వెళ్లే దారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా మారాయి. కంచె లేకుండా రోడ్డుకు ఆనుకొని ఉండడంతో ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం నేలవాలి పడేందుకు సిద్ధంగా ఉంది. చుట్టూ పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగాయి.

‘ప్రజలను చంద్రబాబు నిండా ముంచారు’



అప్పిలేపల్లిలో చంద్రబాబు మోసపూరిత విధానాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుందుర్పి: చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల ఆశ పెట్టి, ఏడాది పాలనలో ప్రజలను నిండాముంచారని ఎంపీపీ కమలానాగరాజు, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్ తదితరులు అన్నారు. ఆదివారం మండలంలోని అప్పిలేపల్లిలో సర్పంచ్ అతావుల్లా ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికార దాహంతో అమలు చేయలేని హామీలిచ్చారని, గద్దెనెక్కిన తర్వాత హామీలు తుంగలో తొక్కారని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రవితేజ, ఉపాధ్యక్షుడిగా బోయ హనుమంతరాయుడు, వడ్డే హనుమంతరాయుడు కార్యదర్శులుగా హరీష్ , చిరంజీవి, సాధిక్, మహేంద్ర, రమేష్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరాయుడు, మండల ఉపాధ్యక్షుడు మందలపల్లి భీమప్ప, ఎస్సీసెల్ కన్వీనర్ తిప్పేస్వామి, కుందుర్పి సర్పంచ్ రామూర్తి, ఐటీ విభాగం డివిజన్ అధ్యక్షుడు మరిస్వామి, నాయకులు జయన్న, సోము, బాబు, పూజారి భీమప్ప, ఆంజనేయులు,ఈ.రాము, మంజు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న అరటి



దెబ్బతిన్న అరటి పంట



కొట్టుకుపోయిన టమాట పంట

కళ్యాణదుర్గం: కంబదూరు మండలంలోని పెన్నానది పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షానికి నదిలోకి నీరు రావడంతో సమీపంలోని రాంపురానికి చెందిన రైతు మనోజ్‌కు చెందిన అరటి, టమాట పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతు తనకున్న పొలంలో ఐదెకరాల్లో అరటి, మూడు ఎకరాలలో టమాట సాగు చేశాడు. భారీ వర్షానికి రెండు ఎకరాల్లో అరటి, రెండెకరాల్లో టమాట పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.3 లక్షలకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ఉద్యాన, రెవెన్యూ అధికారులు స్పందించి ఆర్థిక సాయం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

మొక్కలు నాటిన ‘హెల్పింగ్ హ్యాండ్స్’



పెన్నహోబిలంలో మొక్కలు నాటుతున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో కేఎస్‌డీఎం 1988 హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు శివకుమార్, శాంతరాజు, మారెన్న, ఎర్రిస్వామి మాట్లాడుతూ కాళసముద్రం రెసిడెన్షియల్ పాఠశాలలో 1988లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ‘ హెల్పింగ్ హ్యాండ్స్’ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాటి గురువుల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఈఓ సాకే రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 250 మొక్కలు నాటారు. ఉరవకొండలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీరాములు, చంద్ర, రామన్న, గంగాద్రి, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పెద్దన్న గౌడ్

కళ్యాణదుర్గం: పెన్షనర్ల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్ల భవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వయస్సు రీత్యా ఇచ్చిన అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను తగ్గించిందని, దాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2018 జూల్ నుంచి ఇవ్వాల్సిన పీఆర్సీ బకాయిలు ఇంతవరకూ చెల్లించలేదని తెలిపారు. నాలుగు విడతల కరువు భృతి చెల్లించాలన్నారు. నగదు రహిత చికిత్స పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. రూ.1000 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షీలా జయరామప్ప, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రభాకర్, మల్లికార్జున, తిప్పేస్వామి, భగవాన్, శివ ప్రసాద్, కృష్ణమూర్తి, ఇస్మాయిల్, మారెన్న, ఓబుళప్ప, నరసింహులు పాల్గొన్నారు.

వర్షం వచ్చిందా.. అవస్థలే

- పొంగిప్రవహిస్తున్న వేదవతి హగరి వరదనీరు
- కణేకల్లు–ఉరవకొండకు మళ్లీ రాకపోకల బంద్



కణేకల్లు–మాల్యం మధ్యలో వేదవతి హగరిపై ప్రవహిస్తున్న వరదనీరు

కణేకల్లు: కణేకల్లు మండలంలోని వివిధ గ్రామాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వేదవతి హగిరికి వరదనీరు పొంగి ప్రవహిస్తోంది. వేదవతి హగిరిలో వరదనీరు ప్రవహిస్తుండటంతో కణేకల్లు–మాల్యం మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా ఉరవకొండ–రాయదుర్గం వయా కణేకల్లు మీదుగా నడిచే ఆర్టీసీ బస్సులు ఆగిపోయాయి. ఉరవకొండ నుంచి కణేకల్లుకు వచ్చే బస్సులన్నీ మాల్యం గ్రామంలోనే ఆగి, అటు నుంచి అటే ఉరవకొండకు వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆటోలను ఆశ్రయించి ప్రయాణికులు కణేకల్లుకు చేరుకుంటున్నారు. వేదవతి హగిరిపై ఉన్న హెచ్చెల్సీ అక్విడెక్ట్ (బ్రిడ్జి) దుస్థితికి చేరుకోవడంతో హెచ్చెల్సీ అధికారులు వాహనాల రాకపోకలను అనుమతించలేదు. దీంతో ఇన్నాళ్లూ బస్సులన్నీ కణేకల్లు–మాల్యం మార్గం మధ్యలో ఉన్న వేదవతి హగిరి మీదుగా వచ్చి వెళ్లేవి. చిన్నపాటి వర్షానికి వరదనీరు రోడ్డుపైకొస్తుండటంతో బస్సులు, ఇతరాత్రా వాహనాలు వెళ్లలేని పరిస్థితి. హెచ్చెల్సీ అక్విడెక్ట్‌కు సమానంగా రూ.48 కోట్లతో బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ బ్రిడ్జి పూర్తయ్యే వరకు ప్రయాణికులు కష్టాలను భరించాల్సిందే. ప్రయాణిల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జి పనులను వేగవంతం చేసి త్వరగా ముగించాలని ప్రజలు కోరుతున్నారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న సోదరుడు రామన్న కుమార్తె వివాహ వేడుకలో రాయదుర్గం సమన్వకర్త మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. రామన్న కుమార్తె సాయి ప్రియాంక, విక్రమ్ వివాహ వేడుక కర్నూలులోని తాజ్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగింది. సమన్వకర్త మెట్టుతోపాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మనందరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజులు, వేమన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పార్కింగ్ పాట్లు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

ఉరవకొండ: పట్టణంలో రోడ్ల పైనే ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి. నియోజకవర్గ కేంద్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు అధికంగా ఉంటాయి. సోమవారం సంత రోజు క్లాక్‌టవర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వాహనదారులు, పాదచారులు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంటుంది. 50వేలకు పైగా జనాభా ఉన్న ఉరవకొండ పట్టణంలో 20 వార్డులు ఉన్నాయి. ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల నుంచి గొర్రెలు, మేకలు కొనగోలు చేయడానికి, పెద్దాసుపత్రి, కళాశాలలకు నిత్యం అధిక సంఖ్యలో వస్తుంటారు. పోలీసులు, మేజర్ పంచాయతీ అధికారులు ద్విచక్ర వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



పోలీసు స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారి పై ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

కళ్యాణదుర్గం రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 12,13 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని నియోజవర్గం కార్యదర్శి గోపాల్ ఆదివారం తెలిపారు. కూటమి ఏడాది పాలన పూర్తయినా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న జూనియర్ లైన్‌మెన్ (జెఎల్ఎం) గ్రేడ్–2 లకు నూతన సర్వీస్ రద్దు చేసి, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని గ్రామ సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్–5 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణం సమీపంలో అక్కమ్మగార్ల గుడిలో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో జూనియర్ లైన్‌మెన్‌గా గ్రేడ్–2లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి అనేకసార్లు విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందరెడ్డి, శ్రీనివాసులు, కోశాధికారి నాగరాజు, కార్యవర్గ సభ్యుడు అమరేష్ జాన్ తదితరులు పాల్గొన్నారు.



కూడేరు: పబ్లిక్ జిమ్ చుట్టూ గుంత తవ్విన దృశ్యం

గుంత ఇలా.. ఓపెన్ జిమ్‌కు వెళ్లేదెలా?

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రధాన ద్వారం పక్కనే .13 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు ఉదయం, సాయంత్రం పబ్లిక్ జిమ్ వద్దకు వచ్చి ఎక్సర్‌సైజులు చేసుకుంటున్నారు. అయితే రెండు నెలల క్రితం అధికారులు జిమ్ చుట్టూ మొక్కలు నాటేందుకు లోతుగా గుంత తవ్వి వదిలేశారు. పెద్దలు గుంత దాటుకొని జిమ్‌లోకి వెళ్లాలంటే స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పిల్లలు, పెద్దలు గుంతలు దాటే క్రమంలో అదుపు తప్పి కిందపడే ప్రమాదం ఉంది.

జడివానతో కూలిన ఇల్లు



కూలిన ఇంటి పైకప్పును చూపుతున్న బాధితురాలు గంగమ్మ

బెళుగుప్ప: మండలంలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలకు మట్టిమిద్దెలు కూలిపోతున్నాయి. ఆదివారం ఎర్రగుడి గ్రామంలో గంగమ్మ, మల్లికార్జున దంపతుల ఇల్లు కూలిపోయింది. దంపతులు నిద్రిస్తుండగా, మట్టి పడుతుండంతో గమనించి భయాందోళనతో బయటకు వెళ్లారు. దీంతో ప్రమాదం తప్పింది. దీనిపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు బాధితులు తెలిపారు.